


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 56 | మంగళవారం 25-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు

**రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితి**

**ఫీజు రియంబర్స్‌మెంట్‌లో పూర్తి వివక్ష**

**14నెలల మీ పాలనలో ఏ వర్గం సంతృప్తిగా లేదు**

**ఇదంతా వదిలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారు**

**సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిని కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,ఫిబ్రవరి24:** రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు న్యాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 14 నెలల కాంగ్రెస్ పాలన అసంతృప్తిగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణిపట్ల భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. 14నెలల మీ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరనేది నిస్సందేహమని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా కాలరాస్తున్నారని, ఆఖరుకు ఉద్యోగులకు, పెన్షనర్లకు రొటీన్‌గా అందాల్సిన చెల్లింపులను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని ఆయన లేఖలో పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పేరుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడమనేది ప్రభుత్వ పాలనలో రొటీన్‌గా జరిగే వ్యవహారమన్నారు. కానీ వాటిని కూడా మీరు చెల్లించకపోవడంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి పడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల మీరు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని, ప్రభుత్వాన్ని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో, వారికి మీరు ఏ సందేశం ఇవ్వదలచుకున్నారో ఒక్కసారి ఆలోచించండన్నారు. అంతేకాకుండా..'ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే గత ఏడాది 2024లో 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. ఈ ఏడాది మరో 10వేల మంది రిటైర్ కాబోతున్నరు. వారికి పదవీవిరమణకు సంబంధించిన ప్రయోజనాలను రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించాలి.

## ఎస్సీ వర్గీకరణలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

**తెలంగాణ పనుల్లో మోకాలడ్డుతున్న బిజెపి**

**కెసిఆర్ అప్పులకుప్ప చేసి వెల్లారు**

**కెసిఆర్ అరెస్ట్ కాకుండా అడ్డుకుంటున్నారు**

**ఎమ్మెల్సీ ప్రచారంలో సిఎం రేవంత్ విమర్శలు**



**ఎస్సీ వర్గీకరణ అంశంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా దిగజారిందో వివరించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.**

**కరీంనగర్,ఫిబ్రవరి24:** ఎస్సీ వర్గీకరణ అంశంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా దిగజారిందో వివరించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అప్పుల వల్ల రాష్ట్రం ప్రతినెలా రూ.600 కోట్ల వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉద్యోగులకు ఎప్పుడూ మొదటి తేదీన వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా, కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఆయన పాలనలో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయిందని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో నోటిఫికేషన్ల హామీలు ఇచ్చినా, అధికారంలో ఉన్నప్పుడు వాటిని అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేసినట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్, మంచిర్యాలలో మాట్లాడిన సీఎం.. పీఎం మోదీ హైదరాబాద్ వచ్చి మందకృష్ణ మాదిగను కౌగిలించుకుంటారని, కానీ వర్గీకరణ మాత్రం చేయరని విమర్శించారు. తాము వర్గీకరణపై అసెంబ్లీ తీర్మానం చేసి ఆమోదింపజేశామని గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రోకు అనుమతి రాకుండా కేంద్రంపై కిషన్ రెడ్డి ఒత్తిడి తెచ్చారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు నిధులు రాకుండా అడ్డుకున్నారు, నాకు క్రెడిట్ వస్తదని తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. సట్టభద్రులు అండగా నిలబదండి.. కేంద్రంతో కొట్లాడి నిధులు తెస్తానని సిఎం అన్నారు. కేటీఆర్ ను అరెస్టు చేయకుండా బీజేపీ అడ్డుకుంటోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ ను బీజేపీ బ్లాక్ మెయిల్ చేస్తోందన్నారు. కేటీఆర్ అరెస్టు కాకుండా చూస్తున్నందుకు బీజేపీకి బీఆర్ఎస్ సహకరిస్తోంది. కార్ రేసులో కేటీఆర్ ను ఈడీ ఎందుకు అరెస్ట్ చేయలేదు.. ప్రభాకర్ రావు, శ్రవణ్ రావును ఎప్పుడు విదేశాల నుండి రప్పిస్తారు. బండి సంజయ్ శాఖ పనే కదా ఇది..? సారు రాగానే బొక్కలో వేస్తాం.. వారితో చీకటి ఒప్పందాలు చేసుకుని కాపాడుతున్నారు. ఉాగితాలు ఇచ్చి డ్రామాలు చేస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం ఏడాది వ్యవధిలోనే 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 11,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కూడా చేపట్టామని వెల్లడించారు. అంతేకాదు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా పూర్తిస్థాయిలో సేవా నిధులు అందించలేని స్థితికి రాష్టాన్ని కేసీఆర్ ప్రభుత్వం నెట్టివేసిందని విమర్శించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల పెండింగ్ బకాయిలు ఉండగా, తమ ప్రభుత్వం వచ్చాక వాటిని చెల్లించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను నిర్లక్ష్యం చేసిందని, దీని వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని, పదోన్నతులు, బదిలీలను అమలు చేసినట్లు వివరించారు.

## షెడ్యూల్ వచ్చేసింది



**ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల**

**మార్చి 3న నోటిఫికేషన్, 20న ఎన్నికలు**

**మార్చి 10 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం**

**మార్చి 20న పోలింగ్, ఓట్ల లెక్కింపు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24:** తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. మార్చి 29 నాటికి ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగిసే వారిలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌లు బీఆర్ఎస్‌నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎగ్గె మల్లేశం మాత్రం కొద్ది నెలల క్రితమే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా సహన్ ఎమ్?ఐఎమ్? నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్య బలాన్ని పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లను అధికార కాంగ్రెస్, ఒక స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉంది. తెలంగాణలోనూ ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ కాలం ముగుస్తోంది. మహమ్మూద్ ఆలీ, సత్యావతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, యగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హస్సేన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. వీరిలో నలుగురు బీఆర్ఎస్ కు చెందిన వారు.. ఒకరు మజ్లిస్ కు చెందిన వారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు దక్కనున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బలాబలాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఒక సీటును మజ్లిస్ సాయంతో గెలుచుకోవచ్చు. అంటే బీఆర్ఎస్ ఒక్క సీటు లభిస్తుంది. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడం ఆ పార్టీకి మైనస్. మజ్లిస్ కు కాంగ్రెస్ పార్టీ ఓ సీటు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. అద్దంకి దయాకర్ , జీవన్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, నీలం మధు ముదిరాజ్, బస్వరాజ్ సారయ్య పేర్లు ప్రచారంలో ఉన్నాయి. బీఆర్ఎస్ తరపున ఎవరికి చాన్సిస్తారన్న దానిపై ఇంకా ఆ పార్టీలో ఎలాంటి చర్చ జరగడం లేదు. కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు కూటమికే దక్కనున్నాయి. యనమల, జంగా కృష్ణమూర్తి , డి.రామారావు, పి.అశోక్‌బాబు, తిరుమలనాయుడు పదవీకాలం మ్మునుగుస్తోంది. వీరిలో ఒక్క జంగా కృష్ణమూర్తి తప్ప అందరూ టీడీపీకి చెందిన వారే. అయితే జంగా కృష్ణమూర్తి కూడా ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ఐదుగురు తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీల పదవి కాలం ముగుస్తోంది. ఇప్పుడు ఐదు ఎమ్మెల్సీ సీట్లు కూటమికే దక్కనున్నాయి. ఐదు సీట్లలో ఒకటి జనసేన పార్టీకి ఇంతకు ముందే ఖరారు చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి, పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఈ ఎమ్మెల్సీ సీటును ప్రకటించారు. తర్వాత ఆయనను మంత్రి వర్గంలోకి కూడా తీసుకోనున్నారు. బీజేపీకి ఏమైనా ఎమ్మెల్సీ సీట్లను కేటాయిస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఇటీవల రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజ్యసభ సీటును బీజేపీకి కేటాయించే అవకాశం ఉంటే.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ సీట్లను తెలుగుదేశం పార్టీ నాయకులకు కేటాయించే అవకాశం ఉంది.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

**మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఎన్నిక**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24:** అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాలు సోమవారంనాడు ప్రారంభం కాగా, స్పీకర్ పదవికి విజేందర్ గుప్తా పేరును ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపాదించారు. దీనికి బీజేపీ ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా మద్దతు పలికారు. అనంతరం మూజువాణి ఓటుతో విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు.సభా సంప్రదాయం ప్రకారం స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక కాగానే ఆయనను ముఖ్యమంత్రి రేఖా గుప్తా, విపక్ష నేత సాదరంగా స్పీకర్ సీటు వరకూ తోడ్కొని వెళ్లారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులందరికి కంటే ఎక్కువ మెజారిటీతో విజేందర్ గుప్తా గెలిచారు. తన సమీప ఆప్ అభ్యర్థిపై 37,000 ఆధిక్యంతో ఆయన గెలుపొందారు. కాగా, సోమవారంనాడు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ అరవింద్ సింగ్ లవ్లీ చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేయగా, క్యాబినెట్ మంత్రులు, ఇతర బీజపీ ఎమ్మెల్యేలు, ఆప్ ఎమ్మెల్యేలు వరుసగా ప్రమాణస్వీకారం చేశారు. ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆప్ ప్రయత్నాలు ప్రారంభించింది. మహిళలకు రూ.2.500 ఆర్థిక సాయం ఇస్తామని ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేఖాగుప్తా కార్యాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి అతిషి, ఆప్ ఎమ్మెల్యేలకు నిరసనలకు దిగారు. మార్చి 8వ తేదీన తొలి ఇన్‌స్టాల్‌మెంట్ మహిళా లబ్దిదారులకు చేరాలని డిమాండ్ చేశారు.



## ఇందిరమ్మ రాజ్యంలో ప్రాణాలకు విలువ లేదు

**ఒక పక్క ప్రమాదం జరిగితే... ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్ : కేటీఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి24:** ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు, కూలీల ప్రాణాలకు విలువ లేదని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు.. ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి, గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది ఆచూకీ తెలియని ఈ విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలడం దిగజారుడు రాజకీయమేనని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికే జరిగిన ఘోర దుర్ఘటనపై సీరియస్‌నెస్ లేకపోతే, ఇక అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటది, రెస్క్యూ ఆపరేషన్ ఎలా ముందుకు సాగుతదని ప్రశ్నించారు. ఓట్ల వేటలో జిల్లాలకు జిల్లాలు చుట్టి వచ్చేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉంది కానీ.. ఒక్కసారి క్షతగాత్రుల ఆర్థనాదాలతో మిన్నంటుతున్న ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు వెళ్లే టైమ్ లేదా అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా అంటూ ధ్వజమెత్తారు.

## రైతుల కష్టాలు చూస్తుంటే బాధేస్తుంది

**రైతుల కష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర : హరీశ్‌రావు**



**హైదరాబాద్,ఫిబ్రవరి24:** రాష్ట్రంలో రైతుల కష్టాలు చూస్తుంటే బాధ కలుగుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతన్నను నట్టేట ముంచి, నడి రోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంట నీరు పెట్టిస్తున్నరని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# చుంచ వారి ఇంటివేల్పు "శ్రీ బాలకుమారుడి గంగా స్నాన గట్టం" స్ఫూర్తి దాయకం

**చుంచ వారి ఆడబిడ్డలచే బాలకుమారుడికి గంగస్నానం, కంకణాలు కట్టుడు .**

**దిక్కులు పిక్కటిల్లే డోలి వాయిద్యాలు, నూతనబిందెలతో కుండపోతగా వేల్పులకు గంగా స్నాన ఆచరణ**


**ఆదివాసీ ఆబాలగోపాలం పాల్గొని అద్భుతంగా సాగిన 7అగ్నిగుండాలు దాటిన ప్రక్రియ**

**అలుపులేని ఆదివాసీ నృత్యాలు, కేరింతల నడుమ జాతర గద్దెల వరకు చేరిన శ్రీ బాలకుమారుడు**

**జాతర రాత్రంతా జాగరాలే, కోయతుర్ రేల నృత్యాలే**







**తొలి సమయం డెస్క్ హైదరాబాద్23:**
మానుకోట జిల్లా గంగారం మండలం మడగూడెం, కృష్ణానగర్ గ్రామంలో ఆదివాసి కోయ సామాజిక వర్గానికి చెందిన చుంచ వంశస్తుల ఇలవేలుపు , కోయతుర్ వీర వనిత సమ్మక్క తల్లి చిన తమ్ముడు బాల కుమారుడి జాతర అత్యంత ఘనంగా జరిగింది.. జాతర మొదటి దశగా బాలకుమారుడిని వనం నుండి తీసుకుని రావడం, ఆయన కొలువు దీరిన ప్రదేశం 5 వృక్షాల సన్నిధి నుండి పడగలు, మడ గూడెం చుంచ పాపయ్య ఇంటి నుండి పానుపును జాతర గద్దెలవద్దకు తీసుకొని రావడం ముగిసిన తర్వాత 23వ తారీకు సాయంత్రం బాలకుమారుడికి చుంచ వంశీయుల ఆడబిడ్డలచే గంగ స్నానము చేయించడం ఒక అద్భుతమైన ఘట్టంగా కొనసాగింది. ఒక ప్రత్యేకమైన ప్రదేశంలో చుంచ వారి ఆడబిడ్డలు కొత్త బిందెలను గంగనీటితో నింపి అందులో పూలను ఉంచారు.. ప్రతి బిందెకు పూలదండలు వేశారు. వడ్డెలు, తలపతులు, పెద్దవడ్డెలు, పడిగేవడ్డెలు, సీమకుమారులు, చుంచు వంశీయులతో పాటుగా యాప వంశీయులు, పెండెకట్ల వంశీయులు,వివిధ గ్రామాల్లో వుండే చుంచ వంశస్థులు, మడగూడెం లోని సమస్త ఆదివాసీ కుటుంబాలు ఏకపాటిగా ఒక దగ్గర చేరగా, చుంచ వారి ఆడబిడ్డలు బాలకుమారుడికి కొత్త బిందెల్లో ఉన్న గంగ నీటితో కుండపోతగా కేరింతల నడుమ బాలకుమారునికి స్నానం చేపించారు. స్నానం చేపించే సమయం లో పోటా పోటీను ఆడబిడ్డలు ప్రదర్శించారు. అక్కడి నుండి బాలకుమారుడి గద్దెల వరకు సుమారు రెండు కిలోమీటర్లు అలుపు సొలుపు లేని నృత్యాలతో ఊరు వాడలు ఒక్కటి అయ్యాయి..కేరింతల ర్యాలీ గా వెళ్లిన సుమారు15వందల ఆదివాసీ జనం మహిళా పురుష అనే బేధం లేకుండా 7అగ్ని గుండాలను దాటారు. అత్యంత సాహసంతో కూడిన ఈ అగ్ని గుండాలను దాటడం అనే ఆదివాసీ ధార్మిక సంప్రదాయ తంతును వారి ఇలవేల్పులపై గల భక్తిశ్రద్దలను తెలియజేసింది . కోయ పున్నెం ధర్మ ప్రచారక్ ,ఆదివాసీ 9తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ ముక్యంగా వనం నుండి బాలకుమారుణ్ణి గద్దెల పైకి తేవడం, పడగల అలంకరణ, పానుపు ప్రక్రియ, గంగాస్నాన గట్టం, గుడిమెలుగు వరకు ఆదివాసి సాంప్రదాయ పద్ధతుల్లో జాతర నిర్వహణ కమిటీ సభ్యులైన తన చుంచ పరివార్ సోదరులకు జాతర ముగింపు వరకు దిశా నిర్దేశం చేసారు .ఈ కార్యక్రమంలో తళపతి చుంచ శ్రీనివాస్ చుంచ సారయ్య, చుంచు సారంగదర్, సుధాకర్, సీమ కుమారులు చుంచ రాజశేఖర్, పెద్ద వడ్డే పెండెకట్ల సాయికుమార్, పడిగే వడ్డెలు యాప వెంకటయ్య, యాప శ్రీరాములు ,యాప భూమయ్య ,జలుగడు వడ్డేలు యాప సూర్య ప్రకాష్ సారంగాధర్, దేవరబాలలు, శివసత్తులు, కృష్ణ సాగర్ మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి యాప వంశస్థులు పాపయ్య ఆదివాసి కళా కారిణి మద్దెల సమ్మక్క రాజేందర్,సింగర్ చుంచ శ్రీను, చుంచ వారి అల్లుడు %ఖఖ% ప్రొఫెసర్ ఈసం నారాయణ, మహబాద్ జిల్లా విద్యుత్ అధికారి (ఎస్ ఇ )నరేష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.





# ఉరివేసుకొని మృతి

**జయశంకర్,తొలి సమయం**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన అరికాంతపు రాజు ఆదివారంరాత్రి తన వ్యవసాయ భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తన భార్య సోమవారం తెల్లవారుజామున అరికాంతపు రాజు వ్యవసాయ భూమికి వెళ్లగా రాజు చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతగా భద్రాద్రి జిల్లా బాలికల జట్టు

**అభినందించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చీకటి కార్తీక్**

**తొలిసమయం, కొత్తగూడెం ఫిబ్రవరి 24**





వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 34వ సబ్ జూనియర్ అంతర్రాష్ట్ర బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు సత్తా చాటింది. కాగా బాలికల జట్టును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చీకటి కార్తీక్ అభినందించారు. వారికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీకటి కార్తీక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలోని క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటేలా చేసేందుకు కృషి చేస్తున్నామని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాయంతో జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులకు సింథటిక్ మ్యాట్ తో కూడిన కబడ్డీ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో భవిష్యత్ లో మంచి హెూదాతో కూడిన ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, జాతీయ స్థాయిలో రాణించి భద్రాద్రి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ – భద్రాద్రి జిల్లా సెక్రటరీ కె స్వాతిముత్యం, ట్రెజరర్ నరేష్, కోచ్ సిహెచ్ రాంబాబు, వెంకట్, యూత్ కాంగ్రెస్ నాయకులు గులాం మతిన్, కుంచం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 24**



జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ఆదేశాల మేరకు డిఎస్పీ రెహమాన్ సూచనలతో ఈ రోజు నుండి కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమం లో భాగంగానే ఈ రోజు లైసెన్సులు లేకుండా ఆటోలను నడుపుతున్న రామవరం, సూపర్ బజార్,లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ అడ్డా లకు చెందిన 05గురు డ్రైవర్లకు జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ వారి ఆధ్వర్యంలో లెర్నింగ్ లైసెన్స్ లను ఇప్పించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తెలియజేశారు.డ్రైవింగ్ లైసెన్సులు పొందడానికి అర్హతలు కలిగి ఉండి లైసెన్సులు తీసుకోకుండా వాహనాలు నడిపే వారిపై జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

## నారీ న్యాయ సమ్మేళనంలో పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 24**
హైదరాబాద్ గాంధీభవన్ లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు అధ్యక్షతన నారి న్యాయ సమ్మేళన్ తెలంగాణ రాష్ట్రం లక్ష సభ్యత్వాలు పూర్తి చేసుకున్నసందర్భంగా ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ రావడం జరిగింది కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ సభ్యత్వాలలో నాలుగవ స్థానం వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ అలాగే రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావుచేతుల మీదుగా ఘనంగా సత్కరించడం జరిగింది కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ప్రత్యేక స్థానము ఉంటుంది రాజకీయంగా మహిళలను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందుంటుంది మహిళా కాంగ్రెస్ సభ్యత్వాల ద్వారా వచ్చిన డబ్బులతో ప్రతి జిల్లాలో సానిటరీ యంత్రాంగములను ఏర్పాటు చేయడం జరుగుతుంది. మహిళ ఆరోగ్యం కుటుంబాలకే కాదు రాష్ట్రానికి కూడా వెలుగు లాంటిదే కాబట్టి మహిళా ఆరోగ్యన్ని కూడా ఆలోచిస్తుంది. మహిళా కాంగ్రెస్ అదేవిధంగా మహిళల్లో ఉండేటువంటి నాయకత్వపు లక్షణాలను కూడా గుర్తించి వారిని నాయకురాలుగా తీర్చిదిద్దుతుంది. సభ్యత్వాల వలన ప్రతి మహిళను కలుసుకోవడం వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కూడా జరుగుతుంది దానివల్ల వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడానికి సులభంగా ఉంటుంది తెలంగాణ అన్ని జిల్లాల నుంచి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# కెసిఆర్ ఇంటర్నెట్ సెంటర్ ప్రారంభం

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 24**
దంతాలపల్లి మండలానికి వచ్చిన ఎమ్మెల్సీ కవితకు డోర్నకల్ మాజీ శాసనసభ్యుడు రెడ్డి నాయక్, మాజీ ఎంపీ కవిత మరియు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. దంతాలపల్లి మండలం రామంజపురం గ్రామంలో కెసిఆర్ ఇంటర్నెట్ సెంటర్ కి ఆర్థిక సహాయం చేసి ప్రారంభించారు. అనంతరం దంతాలపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం పీపీపీ మోడ్ లో నడుస్తోంది.పీపీపీ అంటే ఫోబియా, పాలిటిక్స్, పర్సెంటేజ్ ఫోబియా అంటే ముఖ్యమంత్రికి కేసీఆర్ ఫోబియా పట్టుకుంది. మైక్ పట్టగానే కేసీఆర్ ను తిట్టడం మించి ఇంకో ఆలోచన రాదు రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలు, రైతుల కష్టాలు వదిలేసి ఎన్నికల ప్రచారానికి నిజామాబాద్ వెళ్లారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని 10 పర్సెంట్ సర్కార్ అని పిలుస్తున్నారు అందరు పలాన చోట పర్సెంటేజీ ఇస్తే పని చేస్తున్నారని కొంత మంది చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన జరగడం లేదు మహిళలకు 2500 ఇవ్వలేదు కానీ ఇచ్చేశామని పక్క రాష్ట్రంలో ప్రకటనలు ఇస్తున్నారు. పీఆర్ స్టంట్ల మీద ఉన్న సోయి ప్రజలకు పనిచేయడంలో లేదు. ఉచిత బస్సు ప్రయాణం మంచిదే కానీ మహిళల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా చేయవద్దు. బస్సుల సంఖ్య పెంచాలి... అప్పుడే మహిళలతో పాటు అందరికీ సీట్లు దొరుకుతాయి అటో డ్రైవర్లకు ఏడాదికి రూ 12 వేలు ఇవ్వాలి బీఆర్ఎస్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. కేవలం రాజకీయం తప్పా పరిపాలనపై రేవంత్ సర్కారుకు దృష్టి లేదు మిర్చి రైతులు కన్నీరు పెట్టే పరిస్థితి ఏర్పండింది. ఏపీలో ఇదే పరిస్థితి ఏర్పడితే మద్ధతు ధర కోసం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నారు కానీ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోయి లేదు ఎస్ఎల్బీసీ సొరంగం కూలిపోతే దాన్ని సందర్శించే సోయి లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ప్రజలకు ఏం చేశారని ప్రచారం చేయడానికి రైతు రుణమాఫీ ఎవరికీ పూర్తిగా కాలేదు. రైతు భరోసా గ్రామాల్లో చాలా మందికి రాలేదు. రుణ మాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. క్వింటాలు మిర్చికి రూ 25 వేల మద్ధతు ధర కల్పించాలి వరదలు వచ్చినప్పుడు చేస్తామన్న సాయాన్ని ప్రభుత్వం చేయలేదు. వరద బాధితులకు ఇళ్లు ఇస్తామని ఇవ్వని సీఎం రేవంత్ రెడ్డి వరదలొచ్చినా, కన్నీళ్లిచ్చినా, కష్టాలొచ్చినా అండగా ఉండేది గులాబీ జెండానే. కేసీఆర్ హయాంలో అభివృద్ధి చెందిన మహబూబాబాద్ జిల్లా కేసీఆర్ హయాంలో మంజూరైన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ సెలవు

**హైదరాబాద్,ఫిబ్రవరి24:** ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో27న మెదక్ –నిజామాబాద్ –కరీంనగర్ –ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీనిలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగుల కోసం రిటర్నింగ్ అధికారి కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో వెల్లడిం‌ారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుం దని ఆదేశాలలో వెల్లడించారు.వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలోపనిచేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగు లు, హక్కును వినియోగించు కునేం దుకు యాజమా న్యాలు అనుమతి ఇవ్వా లని, ఓటు హక్కును వినియోగి ంచుకునే విధంగా పనిచేస్తున్న వారికి వెసులు బాటు ఇవ్వాలని కూడా రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి చేశారు.

# ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు నృత్యాల నడుమ
# మంత్రి సీతక్కకు మడగూడెంలో స్వాగతం

**బాలకుమారుడి గద్దెల చుట్టూ ప్రహరీ,ఇతర సౌకర్యలకు 5లక్షలు ఇచ్చాను**
**కమ్యూనిటీ హాల్ కోసం స్థలం చూడండి, నిర్మాణం చేద్దాం**
**బాలకుమారుడు జాతర అభివృద్ధికి సహకారం చేస్తాను**
**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**





**తొలి సమయం, మహబూబా బాద్23:**
మడగూడెం బాల కుమారస్వామి జాతర చాలా ఏళ్లుగా ఘనంగా జరుగుతుంది అని పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. గంగారం మండలం మడ గూడెం గ్రామంలో చుంచు వంశస్తుల ఆధ్వర్యంలో జరిగే బాల కుమారుడి జాతరకు ప్రత్యేక ప్రతినిధిగా మంత్రి సీతక్క హాజరు అయ్యారు. జాతరకు ప్రత్యేక ఆహ్వానం తెలిపిన సారయ్య కు సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఆది వాసి సంస్కృతి సంప్రదాయ కొమ్ము నృత్యాలు, డోలి వాయిద్యాలతో చుంచు వారు మరియు మడగూడ అదివాసి తదితర గట్టు వంశస్తులు ఘనంగా స్వాగతం పలికిన తీరు సీతక్క ప్రత్యేక పూజలో పాల్గొని హారతి ఇవ్వడం ప్రత్యేకతను సంతరించు కున్నది. ఈ సందర్బంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..జాతరకు ఇంత పెద్ద మొత్తంగా జరుగడం సంతోషంగా ఉన్నది అన్నారు.. జాతర కు కావలిసిన ఏర్పాటులో భాగంగా ప్రహరీకి, ఇతర సౌకర్యాల రీత్యా 5లక్షలు ఏర్పాటు చేసాను అన్నారు. కమ్యూనిటీ హాల్ కోసం స్థలం ఏర్పాటు చేసుకుంటే హాల్ నిర్మాణం కోసం ఏర్పాటు చేస్తాను అన్నారుఈ కార్యక్రమం లో కోయ పుణ్యం ధర్మప్రచారక్ అది వాసి 9తెగల సమన్వయ కర్త చుంచు రామకృష్ణ తల పతి చుంచు శ్రీనివాస్ సీమకుమారులు చుంచు రాజశేఖర్ పెద్ద వడ్డే పెండెంకట్ల సాయికుమార్ పడిగే వడ్డెలు యాప వెంకటయ్య, యాప శ్రీరాములు యాప భూమయ్య జలుగడు పడిగే యాప సూర్య ప్రకాష్ చుంచు సారయ్య సారంగధర్ దేవర బాలలు శివాసత్తులు కృష్ణ సాగర్ మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి యాప వంశస్థులు పాపయ్య, ఆదివాసీ కళాకారిని మద్దెల సమ్మక్క, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను చల్లా పరామర్శ



**తొలి సమయం హన్మకొండ ఫిబ్రవరి 24:**
హన్మకొండ నగరగానికి చెందిన సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ తల్లి బంగరమ్మ శనివారం రోజున మృతి చెందగా సోమవారం హన్మకొండలోని నివాసంలో ఆమె కుటుంబ సభ్యులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బంగరమ్మ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా దర్మారెడ్డి వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వేంకటేశ్వర రావు, గురిజపల్లి ప్రకాష్ రావు, లేతాకుల సంజీవ రెడ్డి,చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పోలీస్ ధర్మారావు,పుంద్రు జైపాల్ రెడ్డి, అంకతి నాగేశ్వర్ రావు,సుంకరి శివ,దుబాసి నవీన్ తదితరులు ఉన్నారు.

## 26న వరంగల్ జిల్లాకు కెటిఆర్ రాక

**ఇండస్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మహ శివరాత్రి వేడుకలు**

**తొలి సమయం హన్మకొండ ఫిబ్రవరి 24:**



ఈ నెల 26 న ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ, హయగ్రీవ గ్రౌండ్స్ లో నిర్వహించే మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం కేటీఆర్ ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసి, ప్రత్యేకంగా ఆహ్వానించిన రాకేష్ రెడ్డి. ప్రతీ సంవత్సరం ఓరుగల్లు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా మహా శివరాత్రి నిర్వహిస్తామని ఈ సారి వేడుకలకు హాజరవ్వలని కోరిన రాకేష్ రెడ్డి. తప్పనిసరి హాజరవుతానని తెలిపి, వేడుకలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్న కేటీఆర్. గత వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్, పద్మశ్రీ మాడుగుల నాగఫని శర్మ, పద్మశ్రీ గరికపాటి నరసింహ రావు, తనికెళ్ళ భరణి, గంగాధర శాస్త్రి, శశిధర్ శర్మ, జేడి లక్ష్మీనారాయణ, పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరైన విశేషాలు వివరించిన రాకేష్ రెడ్డి. అలాగే ఈ ఏడాది చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సి ఎస్ రంగరాజన్, ఇస్కాన్ స్వామి జీ ప్రణవానంద దాస్, జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, దేశపతి శ్రీనివాస్ పద్మ శ్రీ గడ్డం సమ్మయ్య లాంటి వారు వస్తున్నారని తెలిపారు.

# నర్సంపేటలోఅసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అరికట్టాలి

**ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్ చేసి అమ్మే భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి**
**దుర్వినియోగం అవుతున్న అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాదీన పరుచుకోవాలి**
**ప్రభుత్వ అసైన్డ్ భూముల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం పూనుకోవాలి**
**ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో ఆర్డీవో తహసిల్దార్లకు మెమోరాండం**



**తొలి సమయం నర్సంపేట ఫిబ్రవరి 24:**
నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ అసైన్డ్ భూములను దొడ్డి దారిన ఆక్రమించి ప్రభుత్వ నిబంధనలను అధిక్రమించి పేద మధ్యతరగతి ప్రజలను నమ్మించి అమ్మకాలకు కొనుగోళ్లకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ అసైన్డ్ భూములను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూనుకోవాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు కన్నం వెంకన్న గుండెబోయిన చంద్రయ్య వంగల రాగసుధ డిమాండ్ చేశారు. లేకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలు అట్టి భూముల రక్షణకై పోరు బాట పట్టక తప్పదని హెచ్చరించారు. సోమవారం ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 111 లోని నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో గల అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా భూమి చదును చేస్తూ క్రయవిక్రయాలకు ప్రయత్నిస్తున్న స్థలాన్ని రక్షించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డిఓ, తహసిల్దార్ల వద్ద ఆందోళన చేసి మెమోరాండం ఇచ్చారు.

ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం పేదలకు మరియు సేవకులకు జీవనభృతి కోసం ప్రభుత్వ భూములను అసైన్ చేసి ఇస్తే అట్టి భూములను కొంతమంది అనర్హులు దుర్వినియోగం చేస్తూ దళారులకు క్రయవిక్రయాలకు పాల్పడుతూ ప్రభుత్వం ఆశించిన ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నారని 1977 అసైన్డ్ యాక్ట్ ను విస్మరిస్తున్నారని ఈ క్రమంలో విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని వ్యవసాయం చేయడం కోసం ఇచ్చిన భూమిని దశాబ్దాల తరబడి బీడు బడి ఉన్న రెవిన్యూ యంత్రాంగం పట్టించుకోక పోవడం అట్టి భూములను స్వాధీన పరచుకోకపోవడం జరుగుతున్నదని రక్షించాల్సిన రెవిన్యూ యంత్రాంగమే కబ్జాదారులకు వంత పాడుతున్నట్టు కనబడుతున్నదని పేదలు నిలువ నీడ కోసం గుడిసెలు వేసుకుంటే నిర్దాక్షిణ్యంగా తొలగించి కేసులు పెట్టే ప్రభుత్వ యంత్రాంగం అంగ అర్థ రాజకీయ అధికార బలం ఉన్నవారికి మాత్రం అండగా నిలవడం జరుగుతుందని ఇంతకంటే అప్రజస్వామికం మరొకటి లేదని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరితే నాన్చివేత ధోరణి ప్రదర్శించడం అధికారులకు తగదని ఇప్పటికైనా మాదన్నపేట రోడ్డు 111 సర్వే నెంబర్లో చట్టాలను ఉల్లంఘించి ఎలాంటి అనుమతులు లేకుండా భూములను చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పాల్పడుతున్న కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో అట్టి భూమిరక్షణకు పూనుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంసిపీఐ(యు) నాయకులు భైరబోయిన నర్సయ్య, ఎండి పాషా, అస్గర్, చొప్పరి పద్మ, చింతకింది మనమ్మ, గోనెల అనిత, పెండ్యాల సరిత, మురహరి సరోజన, పద్మ, సాంబ, అరుణ, సంపూర్ణ, నాగమణి, శివ నాగరాజు, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు
## "420- ఆటోలకు స్టిక్కరింగ్ అందజేత

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డిఎస్పి చంద్రబాను**

**తొలిసమయం, ఇల్లందు ఫిబ్రవరి 24:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఇల్లందు డిఎస్పి చంద్రబాను, ఇడ్లందు పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో, ఇల్లందు పట్టణంలోని 420 ఆటోలకు కొత్త స్టిక్కరింగ్ అందజేశారు. ప్రతి ఆటో డ్రైవర్ కు కొత్త నెంబర్ తో పాటు డ్రైవర్ ఓనర్ వివరాలు తో పాటు అన్ని వివరాలు నమోదు చేశారు. వారికి ప్రతి అడ్డ నుండి సీరియల్ నెంబర్ ఇవ్వడం జరిగింది. ఆటో కి ఇచ్చిన కొత్త నెంబర్ జిల్లాలో ఎక్కడ తిరిగినా గాని ఈ నెంబర్ ని మనం ఈజీగా గుర్తించగలమని డిఎస్పి చెప్పారు. ప్రతి ఒక్క ఆటో డ్రైవరు కొత్త స్టిక్కర్స్ ధరించటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డిఎస్పి చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టాల అమలులో న్యాయవాదుల పాత్ర కీలకం

**విశ్వ సమాజం వ్యవస్థాపకులు విశ్వ**



**తొలి సమయం మహబూబాబాద్ ఫిబ్రవరి 24:**
చట్టాల అమలులో న్యాయవాదుల పాత్ర కీలకమని ప్రముఖ న్యాయవాది విశ్వ సమాజం వ్యవస్థాపకులు విశ్వ జంపాల అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పాత, కొత్త క్రిమినల్ మేజర్ చట్టాల టేబుల్స్ తో ఉన్నటువంటి ఏఎల్టి పబ్లికేషన్ పుస్తకాలను న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు విశ్వ బహూకరించారు. అనంతరం విశ్వ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, చట్టాల అమలులో గణనీయమైన పాత్ర పోషిస్తున్నది న్యాయవాదులేనని అయన అన్నారు. ప్రజా ఆమోదం లేని చట్టాలు ఆచరణలో అమలుకు నోచుకోవని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టసభలకు ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులు అశేష ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకొని చట్టాలను రూపొందించాలని అన్నారు. ఉన్నత వర్గాలకు తమ ఆనంగులకూ ఉపయోగపడే చట్టాలను చేసినట్లయితే ఆ ప్రజా ప్రతినిధులను ప్రజలు నిర్ద్వందంగా తోసిపుచ్చుతారని అన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత 2023, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినయం 2023 చట్టాలను ఈ పుస్తకాలలో సెక్షన్లవారిగా పొందుపరచడం జరిగిందని ఈ సందర్భంగా విశ్వ తెలిపారు. ఈ పుస్తకాలు న్యాయవాదులకు చాలా ఉపయుక్తంగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మామిడాల సత్యనారాయణ, మహబూబాబాద్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పోలేపల్లి శ్రీనివాస్, న్యాయవాదులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, భూక్య మోహన్ నాయక్, నీరిటి రాజమణి, సూర్ణపాక హరిబాబు, తోనకనూరి సైదులు, విజయ, వి. రామకృష్ణ, జె. ఎఫ్. సి. ఎం. కోర్టు సూపరిండెంట్ వూడుగుల సంతోష్, అదనపు జె.ఎఫ్. సి.ఎం. కోర్ట్ సూపరిండెంట్ డోలి అనిల్ కుమార్ తదితరులకు ఈ పుస్తకాలను విశ్వ బహూకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కుర్ర మున్నాభాయ్, వై.యాకన్న, జర్పుల సురేష్, భూక్య సురేష్, మణికొండ ప్రవీణ, న్యాయవాద క్లర్కులు సిహెచ్ కృష్ణ, భానోత్ వెంకన్న, సింగం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు

## సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి

**తొలిసమయం, ఇల్లందు. ఫిబ్రవరి 24.**



గిరిజన ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ధర్మ గురువు బోజు మహారాజ్ అన్నారు. సేవాలాల్ సంతు మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ గారి సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో త్యాగాలు చేసిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ప్రతి ఏడాది జరుపుకోవడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు నాయక్, సేవాలాల్ సేవా రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ్చుంద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రవి నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, తోపాటు డీఎస్పీ చంద్రభాను, తాసిల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్ పర్యవేక్షణ
### సి.ఐ గణేష్ తొర్రూర్



**తొర్రూరు తొలి సమయం ఫిబ్రవరి 24**
పెద్దవంగర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఎమ్మెల్సీ టీచర్స్ ఎలక్షన్ ఉన్నందున అట్టి కేంద్రాన్ని కృష్ణ కిషోర్, ఎస్ డి పి ఓ తొర్రుర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి భద్రత నిమిత్తం తగు సూచనలు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో గణేష్, %జ.×% తొర్రుర్ పాల్గొన్నారు. మాట్లాడుతూ రానున్న రోజులలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్లకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో పెద్ద వంగర స్థానిక ఎస్సై క్రాంతి కిరణ్ స్కూల్ హెచ్ఎం బుధరావు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేలమట్టం అవుతున్న కళా సంపదకు జీవం

## అభివృద్ధికి అడుగులు వేస్తున్న గుండం శివాలయం

దశాబ్ద కాలం నుండి గుండం,తిమ్మాపురం, గుడి తండా గ్రామస్థులు కమిటీలుగా వేడుకల నిర్వహణ

20లక్షల రూపాయల మంజూరు చేసిన మంత్రి సీతక్క

శివానాశమరణతో మారుమోగనున్న గుండం శివాలయం

అంధకారంలోని చారిత్రాత్మక శివాలయానికి వెలుగులు





తొలిసమయం మహబూబాబాద్ జిల్లా ఉమ్మడి కొత్తగూడ మండల ప్రతినిధి ఏజాజ్ అలీ ఫిబ్రవరి. 24

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుండంపల్లి గ్రామ శివారులో పాఖాల అభయారణ్యంలో పచ్చని చెట్లు చుట్టూ పక్షుల కిలకిలలు మొదలైన ప్రకృతి అందాలు రెండు చెరువుల నడుమ వందల సంవత్సరాల క్రితం కాకతీయ రాజుల్లో ఒక్కరైనా ప్రతాప రుద్రుడు రాతి శిల్పకళా నైపుణ్యత వట్టిపడే విధంగ ఆలయ నిర్మాణము గవించటంతో పాటు భారీ శివ లింగం ఎదురుగానే అందమైన నంది విగ్రహాన్ని ప్రతిష్టంప చేసి శివాలయాన్ని నిర్మించి పక్కనే చెరువుని నిర్మాణ గావించడం జరిగింది అంతటి చారిత్రాత్మక గుండం శివాలయం ఆదరణకు నోచుకోక శిధిలావస్థకు చేరుకున్న కాకతీయుల నాటి శ్రీ రాజరాజేశ్వర దేవాలయం అభివృద్ధికి పురుడు పోసుకుంది చారిత్రాత్మక ఆలయాన్ని ఈ ప్రాంతంలో నిర్మించడం ప్రాంత ప్రజలకు అదృష్టంగా భావిస్తూ శిధిలావస్థకు చేరుకున్నా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని తిమ్మాపురం గ్రామస్తులు కమిటిగా ఏర్పడి ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదిన జాతర ఉత్సవ వేడుకలను సొంత ఖర్చులతో నిర్వహిస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని పలు మార్లు పాలకులు, పురావస్తు శాఖ వారికి వేడుకున్న పట్టించుకున్న పాపాన పోలేదు కొత్తగా ఎన్నిక అయిన మంత్రి దనసరి అనసూయ (సీతక్క) దృష్టికి తీసుకెళ్లగా తక్షణ ఆలయ అభివృద్ధికి 20 లక్షల రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టడంతో కమిటి సభ్యులతో పాటు ప్రాంత వాసులు హర్షం చేస్తున్నారు. కాకతీయ రాజుల గత వైభవ చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన గుండం శివాలయం 20 లక్షలతో సి సి రోడ్లు, స్నానపు ఘట్టాలు, చలువ పందిరిలు, శివుని యొక్క పరమ భక్తురాలైన రామక్క గుడికి మరమ్మత్తులు చేపడుతున్నారు. కొంత నిధులతో అభివృద్ధికి బాటలు వేసిన గుండం శివాలయం శిధిలావస్థకు చేరుకున్నా విషయాన్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది స్పందించిన మంత్రి కొండా సురేఖ నాలుగు కొట్ల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు ప్రతిపాదనలు పంపించారని బిట్ల శ్రీనివాస్ తెలపడం జరిగింది. చెప్పినట్టుగా కోట్ల రూపాయలతో గుండం శివాలయం అభివృద్ధిని దాల్చితే భక్తులు నిత్యం వేళల్లో దర్శించుకుంటారు పక్కనే ఉన్నా పాకాల పర్యాటక ప్రాంతానికి వచ్చిన పర్యాటకులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేపడితే ఆ ప్రాంతమంతా ఎప్పటికీ శివ నామస్మరణతో మారి పోతుందని అంటున్నారు.





### ప్రాచీన సాంస్కృతిక పుణ్య క్షేత్రం



**గుళ్లపెల్లి శ్రీనివాస్ దేవాలయం కమిటీ బాద్యులు**

కాకతీయ రాజులు వందల సంవత్సరాల క్రితం గుడి తండాలో నిర్మించిన గుండం శివాలయం ఆదరణకు నోచుకోక పోవడంతో శిలా సంపద కాల గర్భంలో కలిసిపోయే పరిస్థితి ఏర్పడింది మరి కొన్ని రోజులు అయితే ప్రాచీన సాంస్కృతిక పుణ్య క్షేత్రం కనుమరుగు అయి ఉండేది తిమ్మాపురం, గుండం,గుడి తండా గ్రామానికి సమీపంలో ఉండటంతో గ్రామస్తులంతా ఐకమత్యంతో తలా కొంత చందాలు వేసుకొని శివరాత్రి పర్వదినాన జాతర వేడుకలు నిర్వహిస్తూ ఈ ప్రాంత ప్రజలకు పూజలు చేసుకుంటూ శివుని ఆశీస్సులు అందే అవకాశం కలుగుతుంది.

### మంత్రి సీతక్కకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటాం



**గట్టి రమేష్ మాజీ సర్పంచ్ గుండం,దేవాలయ కమిటీ సభ్యులు**

చరిత్రాత్మక దేవాలయం మాప్రాంతంలో నిర్మించడం అదృష్టం ఇంతటి అద్భుత కళా సంపద గుండం శివలయం ఎవ్వరు పట్టించుకోక పోవడంతో శిధిలావస్థకు చేరుకుంది విషయాన్ని మంత్రి సీతక్క దృష్టి తీసుకెళ్లడంలో 20లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి ఎవ్వరు పట్టించుకోని ఆలయాన్ని సీతక్క చొరవతో ఆలయంలో భక్తులకు సౌకర్యవంతంగా మారింది మా ఆలయాన్ని అభివృద్ధి పరిచిన మంత్రి సీతక్క ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారు

### ఎన్నో ఏళ్ల కల నెరవేరుతుంది..



**దండు ప్రవీణ్ గుండం తండా రమక్క**

**యువజన సంఘము అధ్యక్షులు, దేవాలయ కమిటీ సభ్యులు**

పచ్చని అందమైన ప్రకృతి నడుమ నిర్మించిన శివాలయం వందల సంవత్సరాల కాకతీయుల దివ్య క్షేత్రం ఎవ్వరు పట్టించుకోక పోవడంతో శిధిలావస్థకు చేరింది కనీస దూప దీప నైవేద్యం లేని పరిస్థితి ఏర్పడింది గతంలో ఏ ప్రభుత్వాలు గాని పురావస్తు శాఖ వాళ్ళు గాని పట్టించుకోలేదు ములుగు నీయోజక వర్గ ఎమ్మెల్యే మంత్రి సీతక్క చొరవతో కొంత మంజూరు నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు ఎన్నో ఏళ్ళ నుండి ఎదురు చూస్తున్న కళ నెరవేరింది

### ప్రస్తుతం మంత్రి సీతక్క 20లక్షలు మంజూరుతో పనులు మొదలు పెట్టాం త్వరలో నాలుగు కోట్లతో అభివృద్ధి

**బిట్ల శ్రీను కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి,దేవాలయం కమిటీ బాద్యులు**



కాకతీయ రాజులు ప్రకృతి అందాల నడుమ నిర్మించినా శివాలయంలో పాలకులు, పురావస్తు శాఖ అధికారులతో నిర్లక్ష్యం వల్ల శిధిలావస్థకు చేరుకుంది తిమ్మాపురం గ్రమస్తులం అంతా కలసి చందాలు వేసుకుని జాతర నిర్వహించుకుంటున్నము జాతర సమయంలో చుట్టు ప్రక్క ప్రాంతల నుండి వేళల్లో భక్తులు వచ్చి దర్శించుకుంటారు. కకతీయ రాజులు నిర్మించిన దేవాలయం ఆదరణ లేక శిధిలావస్థకు చేరింది అభివృద్ధి చేయాలని వేడుకున్న పట్టించుకోలేదు ప్రస్తుతం మంత్రి సీతక్క 20లక్షలు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారు అదే విధంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నాలుగు కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు దీంతో గుండం శివాలయం పూర్వ వైభవాన్ని సంతరించుకుని ఈ ప్రాంతమంతా శివనస్మరణతో మారుమోగుతోంది.

## రాష్ట్రంలో ఆమ్జెన్ రూ.1600 కోట్లు పెట్టుబడులు

**న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్ ప్రారంభం**

**బయోా ఫార్మా రంగంలో భారీగా పెట్టుబడులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24:** అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ హైదరాబాద్ లో తమ న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్ ను సోమవారం ప్రారంభించింది. హైటెక్ సిటీ సమీపంలో ని అమ్జెన్ ఆఫీసు ప్రాంగణంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు అమ్జెన్ ఇన్నోవేషన్ సైట్ ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో అమ్జెన్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాబర్ట్ ఎ. బ్రాడ్వే, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, అమ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి, అమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ చటోపాధ్యాయ, తదితరులు పాల్గొన్నారు. 2025 నాటికి కంపెనీ విస్తరణలో భాగంగా %వి%200 మిలియన్ల (దాదాపు రూ. 1600 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణలో ఆమ్జెన్ మరిన్ని పెట్టుబడులకు ప్లాన్ చేస్తోంది. అమెరికాలో అతిపెద్ద కంపెనీ అయిన ఆమ్జెన్ బయో ఫార్మా రంగంలో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శ్రీకారం చుట్టింది. అమ్జెన్ తమ మెడిసిన్ శ్రేణిని మరింత అభివృద్ధి చేసేందుకు తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్రెడ్డిని గెలిపించాలి

**పీఆర్టీయూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సంకా బద్రినారాయణ కోరారు!**

**పీఆర్టీయూ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గెలుపే లక్ష్యం గా ప్రత్యేక పూజలు**

**అనేక జీఓలు తీసుకువచ్చిన చరిత్ర పీఆర్టీయూది**

**ఉపాధ్యాయ సమస్యలపై మొదటినుంచి పోరాడేది పి ఆర్ టి యు**

**22 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన చరిత్ర ఒక్క పిఆర్టియు టీఎస్ సంఘానికి దక్కింది**

**ఉపాధ్యాయులందరూ సంఘటితంగా ఏర్పడి ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు శ్రీపాల్రెడ్డికి వేసి గెలిపించాలి**



**తొలిసమయం మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి. 24.**

నల్లగొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి గెలిపించాలని పీఆర్టీయూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సంకా బద్రినారాయణ కోరారు. పింగలి శ్రీపాల్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పీఆర్టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గెలుపే లక్ష్యం గా సోమవారం రాత్రి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ..అనేక జీఓలు తీసుకువచ్చిన చరిత్ర పీఆర్టీయూది అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో మొదటి నుండి పి ఆర్ టి యు టి ఎస్ కు అవగాహన ఉందని అన్నారు. నేడు ఉపాధ్యాయులు ప్రభుత్వ ప్రవేశపెట్టిన సిపిఎస్ విధానంతో పాటు 317 జీవోతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాలను పి ఆర్ టి యు టి ఎస్ ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారని అన్నారు. సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్రంలోనే అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి తమ హక్కుల సాధన కోసం ముందుండి పోరాటం చేస్తారని. ముఖ్యంగా నేడు ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించే బాధ్యత తీసుకొని ముందుకు వెళ్తారని సీపీఎస్ రద్దు,ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్, కేజీవీబీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్. త్రీ వన్ సెవెన్ జీవో రద్దు కోసం పోరాడుతారాని. ఉపాధ్యాయ సమస్యలపై మొదటినుంచి పోరాడేది పి ఆర్ టి యు యూనియన్ అని, గత ప్రభుత్వంలో 30% పిఆర్సి సాధించేందుకు, ఉద్యోగుల పదవీ విరమణ వయసుని 61 సంవత్సరాలు పెంచడం కేవలం పి ఆర్ టి యు చేసిన కృషి మూలంగానే సాధ్యమైందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కోసం ప్రభుత్వంతో మాట్లాడి తన వంతు కృషి చేస్తారాని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ టి యు టి ఎస్ నిరంతరం పోరాటాలు చేస్తూ అనేక విజయాలు సాధించామన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో 22 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన చరిత్ర ఒక్క పిఆర్టియు టీఎస్ సంఘానికి దక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఒత్తిడి పెంచుతుందన్నారు. ఉపాధ్యాయులు సమస్యలతో పాటు ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓ, డీఈవో, జూనియర్ లెక్చరర్స్,డైట్ లెక్చరర్స్ వంటి పోస్టులకు పదోన్నతి ద్వారా అవకాశాలు కల్పించాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బకాయి పడిన డిఏలు,వివిధ రకాల పెండింగ్ బిల్లుల పరిష్కార కోసం చిత్తశుద్ధితో పింగలి శ్రీపాల్ రెడ్డి పనిచేస్తారాని. ఉపాధ్యాయులందరూ సంఘటితంగా ఏర్పడి ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కాపరబోయిన సుజాత, రాష్ట్ర బాధ్యులు యద్దనపూడి గాయత్రి, శ్యామలదేవి, సుశీల, దామోదర్, జిల్లా బాధ్యులు సునీత, శంకర్ నాయక్, భోజన్, హైమావతి, శ్రీధర్, మంగీలాల్, చీనా పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

**3 రోజులపాటు వైన్స్ షాపులు, బార్లు బంద్**

**హైదరాబాద్,ఫిబ్రవరి24:** తెలంగాణలోని మందు బాబులకు షాకింగ్ న్యూస్. రేపట్నుంచీ మూడు రోజులు పాటు వైన్స్ షాపులు, బార్లు క్లోజ్ చేయనున్నారు. ఫిబ్రవరి 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27న సాయంత్రం 4 గంటల వరకు లిక్కర్ షాపులు మూసివేయనున్నారు. మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ లలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా.. నల్గొండ - ఖమ్మం - వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా పోలింగ్ జరిగే ఉమ్మడి ఏడు జిల్లాల పరిధిలో మద్యం దుకాణాలు బంద్ అవుతాయి. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ జరగనుండగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనుంది ఈసీ. హైదరాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట మద్యం షాపులు యథాతథంగా తెరుచుకుంటాయి. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కారణంగా కేవలం కొల్లూరు, ఆర్సీ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ మూడు రోజులపాటు మద్యం దుకాణాలు క్లోజ్ కానున్నాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా మద్యం విక్రయించినా, మద్యం సరఫరా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం షాపుల నిర్వాహకులను పోలీసులు హెచ్చరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధి లోని కొన్ని పోలీస్ స్టేషన్లు సైతం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయని తెలిసిందే.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101